కానుక

ముళ్ళపూడి వెంకటరమణ

పాతిక సంవత్సరాలు శ్రమించి తయారు చేసిన వేణువును గోపన్న కృష్ణునికి పంపాడు. కృష్ణుడు ఆ మురళిని ఆప్యాయంగా వాయించాడు. కాని అందులో సంగీతం ఎవరికీ వినబడలేదు. ఈ లీల ఏమిటో!

పొద్దు వాటారి వప్పటినుంచి మర్రిచెట్ల లోంచి వూడలు వూడలుగా దిగజారుతున్న చీకటి, చెలమై చెరువై చెలరేగిన యమునై సముద్రమై భూమినంతా ముంచివేసింది. ఆకాశ మెత్తున ముంచేసింది. రాధ కంటి కాటుకలా కృష్ణుడివంటి వలపులా నందుడి యింటి చల్లలా చిక్కబడింది.

చెట్టుకింద చీకటిమధ్య చితుకుల మంటలు కృష్ణుడి మీద ఎర్రపట్టు కండువాలా కదలాడు తున్నాయి. చీకటి చిక్కదనాన్ని చక్కదనాన్ని వెలుగెత్తి చాటుతున్నాయి. మంటలో ఈచ కాలుస్తున్న గోపన్న ముఖంమీద — అతని పక్కన చెల్లాచెదరుగా పడివున్న వేణువులమీద కొంచెం అవతలగా బొత్తికట్టివున్న వెదుళ్ళమీద వెలుగు నీడల భాషతో కావ్యాలు రాస్తున్నాయి.

ఇంక మూడు ఝాములుపోతే సప్తమి తెల్ల వారుతుంది. కృష్ణుడి పుట్టినరోజు వచ్చే స్తుంది. పాతిక పండగలనాడు గోపన్న ఆరం భించిన వేణు నిర్మాణం ఇంకా తెమలలేదు. రేపటి కైనా సాధించి, తన వేణువును ఆయనకు సమ ర్పించాలి. రేపివ్వలేకపోతే ఇంక ఈ జన్మకివ్వలేడు.. వేళయిపోయింది.

“నాయనా, బువ్వ దినవే” అన్నాడు చిన్న గోపన్న వచ్చి. గోపన్నకీమాట వినపడలేదు.

అతని హృదయం బృందావనిలో ఉంది. అక్కడకు కృష్ణుడు వస్తాడు. వచ్చే వేళయింది. అప్పుడే గోపికల అందెల రవళి వినిపిస్తోంది. గాజుల గలగలలు, నవ్వుల కిలకిలలు వినిపిస్తు న్నాయి. ఇవతల వెదురు పొదలు సన్నగా ఈల వేస్తున్నాయి. ఈ ఉపశ్రుతులన్నీటినీ కలుపుకుని



ఆదిశంకర దేవాలయం (కలాడి) ఫొటో—కె. రాజారామ్‌రావు (మద్రాసు-4)

కొద్ది క్షణాలలో మోహన మురళీరవళి విన వస్తుంది.

గోపన్న ఎన్ని యుగాలుగా అక్కడ చెట్ల మాటున కూర్చున్నాడో అతనికే తెలియదు. ఆకులలో ఆకై పువ్వుల్లో పువ్వయి, ఇసుకలో రేణువై యమునలో బిందువై స్తబ్ధంగా, కూర్చుని కృష్ణ వంశీనాదాన్ని హృదయంలో పోసుకున్నాడు. పరిశుద్ధమైన స్వరాలలో ఒక్కొక్క స్వరాన్ని మనసులో నిలుపుకుని దాని విశ్వరూపం దర్శించడానికి తపస్సు చేశాడు. అదే మనసులో పదిలంగా దాచుకుని పరుగున తన కుటీరానికి వచ్చాడు. కొత్త వెదురుకోసి స్వరద్వారాలువేసి, మనసులో స్వరాన్ని ఇందులో పలికించబోయాడు. ఆ స్వరం తన ఈ వేణువులో పలికితే ఇది కృష్ణయ్యకు కానుక ఇవ్వాలి. కాని అది పలకదు. పలికించాలని అతను ఎన్నివేల వేణువులో చేశాడు. తన ఉచ్ఛ్వాసనిశ్వాసాలన్నీ వేణువును శ్రుతి చేయడానికే ఉపయోగించాడు. జీవితకాలమే తక్కువ. ఒక జీవితానికి లెక్కదేలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కొన్ని కోట్లు ఉంటాయి. వాటిని వృథాచేస్తే ఎలా? యమున ఒడ్డున పొదల మాటున దాగి కూర్చుని కృష్ణుడి మురళి విన్నప్పుడు అతను వూపిరి బిగబట్టుకునే కాలం గడిపేవాడు. అక్కడ పొదుపుచేసిన దానిని తన కొత్త వేణువును పూరించడానికి ఉపయోగించేవాడు. తీరా పూరించేవరకూ అది శ్రుతి శుద్ధంగా వినబడేది కాదు. పైగా జీరబోయేది. లోపలేవన్నా ఈనెలు లేచాయేమోనని గోపన్న ఎంతో శ్రద్ధగా లోపలకూడా నునుపు చేసేవాడు. ఇక పట్టుకు వెళదాం అని లేచేసరికి దాని గొంతుక జీరపోయేది.

గోపన్న పూర్వం ఎన్నో వేణువులు చేశాడు. తృప్తిగా వాయించాడు. బాగానే ఉందనుకున్నాడు కాని ఒక స్థాయి వచ్చాక అతనికొక ఊహ పోయింది. వేణువును కిందపెట్టి, సంగీతాన్ని ఊహించబోయాడు. ఊహించిన సంగీతాన్ని భావనచేసి, భావించిన దానిని అనుభవించి దర్శించే వరకు అతనికొక సత్యం తోచింది. సంగీతాన్ని

కానుక

అనుభూతికి తెచ్చుకోవడానికి జంత్రగాత్రాలను ఉపయోగించబోవడం అవివేకం. జలపాతాన్ని వెదురుగొట్టంలో ఇముడ్చడం పొరబాటు. సముద్రాన్ని పాలకడవలో ఇముడ్చడం తెలివితక్కువ.... ఊహాకందే సంగీతంలో పాటకందేది శత సహస్రాంశం వుండదు.

ఊహసాగిన కొద్దీ స్వరలత దిగంతాలవరకు వ్యాపించసాగింది. ఆకాశం వరకు వ్యాపించసాగింది. రోదసి అంతా నిండిపోసాగింది. క్రమంగా, ఓంకార జనితమైన స్వరార్ణవం తిరిగి ఓంకారమై భువన సమ్మోహనంగా భీకరంగా అద్భుతంగా ఎరుకపడసాగింది. శ్రుత సంగీతంలా ఇందులో అపశ్రుతులు లేవు. అపశబ్దాలు లేవు. అన్ని వేదాంతాలూ, అన్ని అసత్యాలూ అర్ధసత్యాలేనంటూ, తనలో భాగాలేనంటూ నిలచే అద్వైత సత్యంలా ఈ సంగీతంలో అపస్వరాలు కూడా అర్ధస్వరాల, పూర్ణస్వరాల పక్కన నిలిచి, అందాలు సంతరించుకొని, అందంగా భాసించసాగాయి. ప్రతి అణువునా భగవంతుడున్నాడు. ప్రతి శబ్దం లోను సంగీతం ఉంది. అన్న వాక్యాల తాత్పర్యం అతనికి ఎరుకపడింది గోపన్న అర్భక దేహానికిది దుర్భరమైపోయింది. అతను ఊహించిన సంగీతాన్ని అనుభవించడానికి శక్తి చాలలేదు.... వయవాలన్నీ విలవిలలాడేవి. హృదయం బద్దలయి పోయేస్థితికి వచ్చింది. ఆనందం, ఆనందం దగ్గరగా వస్తే ఇంత దుర్నిరీక్ష్యాలై దుర్భరాలై ఉంటాయని అతను ఊహించుకోలేదు. ఇప్పుడు గ్రహించికూడా తప్పించుకోలేడు.....

అతన్ని ఆస్థితినుంచి ఐహిక స్థితికి తెచ్చి కాపాడినది — కృష్ణుడి మురళి... అది విన్న క్షణాన అతను ముగ్ధుడై పోయాడు. ఆ స్థితి లోకే మేలుకున్నాడు. తన ఊహకు అందిన దానికన్న గొప్పదీ, ఆకళింపు చేసుకుని అనుభవించ డానికి సులువైనదీ అతనికి ఆనాడే వినిపించింది నాటినుంచి ప్రతి నిత్యం కృష్ణుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్ళి, మురళి వినేవాడు. కొత్తల్లో కొన్నాళ్ళు గోపకాంతలు కంగారు పడ్డారు. తరవాత అతన్ని ఒక గోవుగా, చెట్టుగా జమ కట్టేశారు.

ఇంత మోహనమైన సంగీతాన్ని కృష్ణుడు ఒక వెదురు ముక్కలో ఎలా ఇమిడ్చాడా అని గోపన్న ఆలోచించాడు. ఒకసారి అతని ఇంటికి వెళ్ళి ఆ మురళిని ఎత్తుకు వచ్చాడు. యమున ఒడ్డుకువచ్చి, చెంగుచాటు నుంచి మురళి తీసి వాయించాలనుకునే సరికి అది కనబడలేదు.

మాయదారి కృష్ణుడు... గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి అనుకున్నాడు గోపన్న.

కాని గజదొంగ ఆ సాయంత్రం కనబడి "గోపన్నా నామురళి తీసుకుపోయావు కదూ.... పోనీ ఇంకొకటి చేసిపెట్టు" అన్నాడు నవ్వి.

గోపన్న తెల్లబోయాడు.

ఆ మర్నాటినుంచి వేణు నిర్మాణం ఆరంభించాడు గోపన్న. ఆరంభించిన నాటినుంచి అతనిలో కొత్తశక్తి, కొత్త చైతన్యం మేల్కొన్నాయి. తన చేతులలో రూపు దిద్దుకుంటున్న మురళి రేపు మాపటివేళ కృష్ణుడి హస్తాలను అలంకరిస్తుందని ఆయన అందులోకి జీవాన్ని ప్రతిపాదిస్తాడని అనుదినం ఆశపడుతూ ఆనందిస్తూ మురళిని రూపొందించాడు. ఆయన పెదిమలానేచోట, వేళ్ళు ఆనేచోట మురళి కఠినంగా ఉండి నొప్పెంచకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాలను తన చేతులతో అరగదీశాడు.

మురళి సిద్ధంకాగానే శ్రుతి చూశాడు. గుండె బద్దలయినంత పనయింది. అది శ్రుతి శుద్ధంగా లేదు. పైగా జీర. రెండు మూడు వేణువులు పలికినట్టుంది. కృష్ణుడు వూదుతాడన్న ఆనందంలో దానికి ఒళ్ళు పులకరించిందా?....

గోపన్న అది పడేసి మరొకటి చేశాడు. అదీ అంతే.

మర్నాడు వెదురు చాలా తెప్పించాడు. పది పన్నెండు చేశాడు. ఒక్కొక్కటే వూది చూడడం నచ్చక పారవెయ్యడం....

"నీకు వేణువు ఇవ్వందే నా ముఖం చూపను కృష్ణయ్యా" అనుకున్నాడు. నాటినుంచి ఇదే పనిపెట్టుకున్నాడు. సాయంకాలం బృందావని వేపు వెళ్ళి వేణుగానం వినడం, ఉదయాస్తమానం కొత్తవేణువులు చెయ్యడం..

ఊళ్లో వాళ్ళంతా ఇది వింతగా చెప్పుకున్నారు. కొత్తల్లో మెచ్చుకున్నారు. తరవాత ఆ సంగీతం పిచ్చి వదిలిందనుకుంటే, మళ్ళీ ఈ పిల్లంగోవి పిచ్చి పట్టిందిగావాల అని నవ్వుకున్నారు. తరవాత నవ్వారు.

గోపన్న పనికిరావని పడేసిన వందలాది వేణువులను కొత్తలో గొల్లపిల్లలు తీసుకుపోయేవారు. తరవాత అతనికి భయం వేసింది— వాటిలో ఏదన్నా కృష్ణయ్య దగ్గరకు పోతుందేమోనని. అందుకని చేసిన వేణువులన్నీ పాకలో అటకమీద పడేసేవాడు.

యమున ఒడ్డున గోపన్న పాక, పాకపక్కన

పందిరికింద వెదుళ్ళు, చెట్టుక్రింద కొలిమి చూసి వూళ్ళో జనం హేళనచేశారు— గోపన్నా! ఏకంగా పెద్ద కలపదుకాణం పెట్టరాదూ!..... వ్యాపారం చేసినట్టూ ఉంటుంది అని...

గోపన్నకు నవ్వడానికీ, నవ్వుకోడానికీ కూడా తీరికా, కోరికా, ఓపికా లేవు..

• • •

పాతికేళ్ళు గడిచిపోయాయి. కృష్ణయ్య పెద్ద వాడయ్యాడు. బృందావనికి రావడం లేదు. పట్నవాసం మనిషైపోయాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. అయినా కృష్ణాష్టమి వెళ్ళిన ప్రతి నవమినాడు గోపన్న కొత్త ఉత్సాహంతో కొత్త వేణువు ఆరంభిస్తూ, 'పైసారి పుట్టిన రోజుకేనా పంపాలి'... అనుకొనేవాడు. పుట్టిన రోజు వచ్చేది వెళ్ళేది.... వేణువు మాత్రం కుది రేదికాదు. ఏమిటో ఆ జీర. ఎవరో వెక్కిరిస్తూ న్నట్టు.... ఏదో శాపం ఉన్నట్టు....

• • •

"నాయనా బువ్వదివవే ..' అన్నాడు చిన్న గోపన్న.

తండ్రి వాడివంక చూశాడు. జాలివేసింది. తల్లిలేని బిడ్డ. తండ్రి ఉండీ లేనిబిడ్డ. ఆ వయ సుకి వాడే రోజూ ఇంత గంజికాచి పెడుతున్నాడు. వాడి అచ్చటా ముచ్చటా వాడే చూసుకుంటు న్నాడు. అదీ మంచిదే అయింది.

రేపు అష్టమి వెళ్ళిన నవమినాటినుంచి, నాయనలేడని బెంగటిలుతాడన్న బెంగలేదు. ఎవ రికి వారే యమునా తీరే. ..

"బువ్వదింటాలేగాని, రేపు కిష్టయ్య పుట్టిన రోజు.... నువ్వు నందయ్యగారి లోగిలికెళ్ళి ఎవరూ చూడకుండా ఇది కిష్టయ్యకిచ్చి— మా నాయనిచ్చి రమ్మన్నాడని చెప్పిరావాల" అన్నాడు గోపన్న.

"బువ్వదినుమరి" అన్నాడు బిడ్డడు

గోపన్నకి ఎందుకో వాణ్ణి చూడగానే బాల కిష్టయ్య గుర్తుకొచ్చాడు.

అటూ ఇటూ బెరుగ్గా చూసి గబుక్కున వాణ్ణి దగ్గరకు లాక్కుని గాఢంగా ముద్దు పెట్టు కున్నాడు.

బుల్లాడికిది కొత్త... వాడు తెల్లబోయిచూసి బుగ్గ తుడుచుకున్నాడు.

"బువ్వదిను మరి" అన్నాడు.

"మురళి పట్టికెళ్తావా"

'నువ్వలాగే అంటావు. పొద్దుటేలేమో ఇది

బాగాలేదు ఒద్దులే అంటావు"

"అనను. ఈసారి చేసేది బాగుంటదిలే అయినా చూడమగా" అన్నాడు గోపన్న నీరసంగా నవ్వి.

"బువ్వదినుమరి" అన్నాడు చిన్నగోపన్న.

• • •

మర్నాడు ఉదయమే గోపన్న కొడుక్కి తలంటి నీళ్ళు పోశాడు. సాంబ్రాణి ధూపమేసి జుట్టు ఆరబెట్టాడు. చిక్కుదీశాడు. వదులుగా కొప్పు

"కమలేందీవర షండ మండిత లసత్కాసార తీరంబు" ఫోటో—నందలాల్ (బొంబాయి-1)

ముడేసి పూలు తురిమాడు. పట్టు కండువాతీసి పంచె కట్టాడు. మరొకటితీసి ధట్టీ చుట్టాడు. కస్తూరి తిలకం దిద్దాడు. కాటుకదిద్ది, దిష్టి తగలకుండా బుగ్గన చుక్కపెట్టాడు. నెమిలీకల పీచనలోంచి ఒక కన్నుతీసి కొప్పున బెట్టాడు.

చినగోపన్న కీ వరస బొత్తిగా నచ్చలేదు. ఎన్నడూ లేని పనులు చేస్తున్నాడు అయ్య. వాడికెందుకో గుబులేసింది. కంట నీరు తిరిగింది. జాలిగా నాయన వంక చూశాడు. ముస్తాబు ముగించిన గోపన్న తృప్తిగా ఒక్కసారి కొడుకును చూశాడు.

క్షణంలో నిర్విణ్ణుడై పోయాడు. ఇదేమిటి బాలకృష్ణుడు గోపాలకృష్ణుడు... ఇక్కడికి... ఎందుకొచ్చాడు? తాను ఏనాడో ఎత్తుకొచ్చిన వేణువు కోసమా?

గోపన్న తేరిపార చూశాడు. సందేహంలేదు కృష్ణుడే. అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాడు. ఒక్కసారిగా కన్నీరు కట్టలు తెంచుకుంది. అవి దుఃఖమో, ఆనందమో.

"ఏందే అయ్యా" అంటూ బారున వచ్చి కౌగలించుకున్నాడు కొడుకు. తండ్రి దండం పెట్టేసరికి వాడికి ప్రాణం కంగారు పెట్టేసింది.

గోపన్న ఉలికిపడి కళ్ళు తుడుచుకున్నాడు. దేవుడికి దండం పెట్టానురా అన్నాడు.

"ఏదే... మురళేదే" అంటూ అటూయిటూ చూశాడు. కనబడలేదు.

"అటకమీదెట్టాను. రాతిరి ఎలకలొస్తే..." అన్నాడు చినగోపన్న భయపడుతూ.

"ఆ! ఎంత పన్జేశావురా బాబూ...."అన్నాడు గోపన్న. ఎలకలుండేదే అటకమీద అని తెలిసి అక్కడ పెట్టడ మేమిటని కేకలెయ్యబోయాడు గాని మనస్కరించలేదు.

అటకమీద కెక్కి చూశాడు. అక్కడ తను పనికిరావని పడేసిన వేణువులు గుట్టలుగా ఉన్నాయి అందులో ఏది కొత్తది? ఏది మంచిది?

గోపన్న ఆ వేణువులన్నీ కిందకు దించాడు. ఒక్కొక్కటే తీసి వూది చూడసాగాడు.

"ఇదికాదు"

"ఇదీ కాదు..."

"ఇదీ కాదు..."

ఇటువేపు గుట్ట తరుగుతోంది. అటువేపుది పెరుగుతోంది. కాలం తరుగుతోంది.

మధ్యాహ్నం భోజనం వేళ వచ్చింది. వెళ్ళింది. గోపన్న "నేతి నేతి" అనుకొంటూ వేణుపరీక్ష సాగిస్తూనే వున్నాడు.

చిన్నగోపికి తండ్రిని పలకరించేందుకు సాహ సం చాలలేదు. వాడూ అలాగే కూర్చున్నాడు.... చెమటకి కస్తూరి బొట్టు కరిగిపోయింది. కాటుక చెరిగిపోయింది. పూలు వాడిపోయాయి. వాడి సంతోషం, ఉత్సాహం చెన్నుదరిగాయి. అన్నం తిననందువల్ల నీరసంకూడా కలిగింది.

కానీ గోపన్న ఇదేమీ గమనించే స్థితిలో లేడు.

ఇదికాదు

ఇదీ కాదు....

ఇన్ని వేణువుల గుట్టలో ఎక్కడో సత్యమైన కొత్తవేణువు దాగి ఉంది.

అది సత్యమైనదేనా?

......ఏమో... గోపన్నకి తెలియదు. పరీక్షించి చూడలేదు. అయివుంటుందని, అయితీరాలనీ...

• • •

పొద్దు వాటారింది. చీకటి చిక్కబడింది. చిన్నగోపన్న దీపం వెలిగించాడు.

"నాయనా చీకటి పడిపోతోందే పుట్టింరోజు పండగయిపోతుంది." అన్నాడు జంకుతూ. గోపన్న తల వూచాడు. ఇక రెండే రెండు వేణువులు మిగిలాయి. ఒకటి చూశాడు.

ఇదీకాదు.

ఇంక ఒక్కటి మిగిలింది. ఇదేనా... ఏమో... అతను ఉదయం నుండి వెతుకుతున్నది మంచిది కాక, కావందువల్ల ఈ గుట్టలో పడిపోయిం దేమో. ఇప్పుడు మిగిలింది— ఒకప్పుడు పనికి రాదని తాను పడవేసిందేమో....

చివరి మురళిని పరీక్షించడానికి గోపన్నకి ధైర్యం చాలలేదు. సత్యం తెలుసుకొని చనిపోగల శక్తిలేదు. మళ్ళీ ఇంకో ప్రయత్నం ఓపికలేదు. వ్యవధిలేదు.

"ఇదే" అన్నాడు ధీమాగా.

"చూడవా" అన్నాడు కుర్రాడు.

"ఒద్దు.... ంగెల్చు... కిష్టయ్య చేతి కియ్యి ఆయనే చూస్తాడు ఆయనే చెబుతాడు" అన్నాడు గోపన్న.

కుర్రాడు ఇంక ఆగలేదు. మళ్ళీ తండ్రి మనసు మారేలోపల పారిపోవాలనుకొన్నాడు. చీకట్లోకి పరుగెత్తాడు.

• • •

పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది.

గోపన్న నీరసంగా మేను వాల్చాడు. పూర్వం పూహా సంగీత ప్రపంచంలోకి తొంగిచూసినపుడు కూడా ఇలాటి నిస్త్రాణే కలిగేది. ఇవాళా అదే....

తాను పని ముగించాడా. భగవంతుడికి సరిపైన శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా...

కానుక

ఇన్ని సంవత్సరాలు కృషిచేసి ఇన్ని వేల పరీక్షలు జరిపి, చివరికి పంపిన వేణువును పరీక్షించుకోలేదు. అది కృష్టయ్యకే వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయనే సరిచేసుకొంటాడు.

అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా... సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా?

గోపన్నకు నవ్వువచ్చింది....

ఎంత పొరబాటు.. పాతికేళ్ళ పొరబాటు.... ఒక జీవితం పొరబాటు. ఆయన అలుగుతాడా... అలగడు. నవ్వుకుంటాడు. వెర్రిగోపన్న అనుకొంటాడు. అనుకొని మురళిని తన పెదిమల దగ్గర ఉంచుకుంటాడు. శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి మంగళగళంలోంచి మధురాధరాలలోంచి.......

వెన్న పాలూ ఆరగించిన మధురాధరాలలోంచి, రాధాధరాలను పవిత్రంచేసిన మధురాధరాలలోంచి జీవం వచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది.....

తన పక్కనున్న వేణువులోంచి సన్నటి చక్కటి స్వరం నెమ్మదిగా ఇవతలికి రావడం, వచ్చి తన చెంపనిమరడం గమనించాడు గోపన్న.

ఇదేమిటి తను పనికిరాదనుకున్న మురళి...

ఇంకో క్షణానికి ఆపక్క మురళి ఉత్తర క్షణార్థానికి ఇటుపక్క మురళి మేలుకున్నాయి మరికొద్ది క్షణాలలో ఆ కుటీరంలోని సహస్ర వేణువులూ భువన మోహనంగా గానం చేయ సాగాయి. గోపన్న లేచి కూర్చున్నాడు. భ్రమరాన్ని చూస్తున్న కీటకంలా దశదిశలా పరిభ్రమించాడు అన్ని వేణువులూ పాడుతున్నాయి. అన్నిటిలోనూ అలనాటి బృందావన కృష్ణుడి మోహన గానమే. అన్నీ శ్రుతి శుద్ధంగా ఉన్నాయి. అసత్యమైన వేణువు లేనేలేదు. భగవంతుడికి ఉపయోగపడని వేణువే లేదు....

గోపన్న విభ్రాంతుడైపోయాడు.

నీరసంగా ఆనందంగా మేనువాల్చాడు. సహస్ర వేణునాద స్వరార్ణవంలో— సాక్షాన్మహావిష్ణువై తేలుతున్నాడు....

వేణుగానం ముగిసిన కొద్ది క్షణాలకు అంతకన్న మధురమైన అడుగుల సవ్వడి వినబడింది. చిన్నగోపన్న వచ్చి వుండాలి. తను పంపిన మురళి మంచిదో కాదో చెప్తాడు. ఈసత్యం ఇక తెలిసినా మానినా ఒకటే. అంతకన్న గొప్ప సత్యాన్ని దర్శించాడు గోపన్న.

గోపన్న నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

గుమ్మంలో బాలకృష్ణుడు!

పట్టుపంచ పట్టుధట్టీ కస్తూరిబొట్టు బుగ్గన చుక్క సిగలో పింఛం....

నువ్వే వచ్చావా కిష్టయ్యా... అంటూ లేచి కూర్చుని చేతులు జోడించాడు గోపన్న.

"అయ్యో అయ్యో కిష్టయ్య నీమురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యో మరేం......... కిష్టయ్య నీమురళి వాయించాడే. కానీ..... మరే.... ఎంత వాంచినా ఏమీ వినబడలే. అసలు పాట రాలేదే... కాని కిష్టయ్య మంచోడు నన్నిక్కడ ముద్దెట్టు....."

గోపన్న తల పక్కకు తిప్పి గదినిండా పడి వున్న వేణువులను చూశాడు.

ఇంతసేపూ గానంచేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దు పెట్టుకున్నాడు గోపన్న. ★